ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
శుక్రవారం 12 జూలై 2024





దార్లపూడి వద్ద మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

జిల్లాకు బాబు వరాలు

చెరకు రైతులకు సీఎం తీపి కబురు

- మూతపడిన మూడు షుగర్ ఫ్యాక్టరీలు తెరిపించే దిశగా చర్యలు
- పోలవరం ఎడమ కాలువ పనులకు రూ.800 కోట్లతో టెండర్లు
- ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పనులు పరుగులు పెట్టిస్తామని హామీ
- ముఖ్యమంత్రి చంద్రబాబు హామీతో జిల్లా వాసుల్లో హర్షాతిరేకాలు

అనకాపల్లి/ఎస్.రాయవరం, జూలై 11 (ఆంధ్రజ్యోతి):

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లాపై వరాల జల్లు కురిపించారు. జిల్లాలో మూతపడిన తుమ్మపాల, ఏటికొప్పాక, తాండవ షుగర్ ఫ్యాక్టరీలను తెరిపించి చెరకు రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఉత్తరాంధ్ర పర్యటనలో భాగంగా గురువారం ఆయన ఎస్.రాయవరం మండలం దార్లపూడిలో పోలవరం ఎడమ ప్రధాన కాలువను పరిశీలించారు.





దార్లపూడి వద్ద పోలవరం ఎడమ కాలువ, అక్విడెక్టు స్థితిగతులు తెలుసుకుంటున్న ముఖ్యమంత్రి

జిల్లాలో ఎడమ కాలువకు సంబంధించిన 6, 7, 8 ప్యాకేజీ పనుల స్థితిగతులపై ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను చంద్రబాబు తిలకించారు. ఈ సందర్భంగా జలవనరుల శాఖ ఇంజనీర్లకు పలు సూచనలు చేశారు. ఆ తరువాత అక్విడెక్టు వద్దకు చేరుకొని గత ఐదేళ్లుగా ఆగిన పనులను పరిశీలించారు. అనంతరం ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాల ఏర్పాటుపై కసరత్తు జరుగుతోందని, సూపర్ సిక్స్ పథకాల అమలు విషయంలో రాజీ పడే ప్రసక్తి లేదని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా పోలవరం ఎడమ కాలువ పనులు, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం పనులు నిలిచిపోయాయని, ఈ రెండు పథకాలను పూర్తి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. రూ.800 కోట్ల అంచనా వ్యయంతో త్వరలోనే టెండర్లు పిలిచి పనులు చేపట్టేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని జల వనరుల శాఖాధికారులను ఆదేశించారు. పోలవరం ఎడమ కాలువ పనులు పూర్తయితే అనకాపల్లి జిల్లాలో లక్ష ఎకరాలకు సాగునీరు అదనంగా అందుతుందని, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం పనులు పూర్తయితే అనకాపల్లి జిల్లాలో మొత్తం 2 లక్షల 80 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. పోలవరం కాలువ, సుజల స్రవంతి పథకానికి అనుసంధానం చేసి జిల్లాకు పోలవరాన్ని ఒక వరంగా మారుస్తామని చంద్రబాబు వ్యాఖ్యానించడంపై జిల్లా ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

సుజల స్రవంతి పథకాన్ని పరుగులు పెట్టిస్తాం

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం పనులు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నట్టు ఉన్నాయని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఈ పనులను ఎన్‌డీఏ ప్రభుత్వం పరుగులు పెట్టించే దిశగా చర్యలు చేపడుతుందన్నారు. సుజల స్రవంతి పథకం పనులు చేపట్టి ఈ ప్రాంత ప్రజలకు సాగు, తాగునీరు అందిస్తామన్నారు. పోలవరం ఎడమ కాలువ పనులతో పాటు ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పనులు ... మిగతా 8వ పేజీలో



మెడ్ టెక్‌జోన్‌లో ప్రారంభించిన కంపెనీలను పరిశీలిస్తున్న చంద్రబాబు

చంద్రబాబుకు అపూర్వ స్వాగతం

దారి పొడవునా పూల వర్షం కురిపించిన మహిళలు

- గజమాలతో హోం మంత్రి అనిత సత్కారం
- బాబుకు స్వాగతం పలికిన స్పీకర్ అయ్యన్న, మంత్రులు అనిత, రామానాయుడు, ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యేలు

ఎస్.రాయవరం, జూలై 11:

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అపూర్వ స్వాగతం లభించింది. మండలంలోని దార్లపూడి వద్ద అసంపూర్తిగా ఉన్న పోలవరం అక్విడెక్టును పరిశీలించడానికి గురువారం ఇక్కడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు ఉదయం సుమారు 11:35 గంటల సమయానికి చంద్రబాబు చేరుకున్నారు. ఆయనకు శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, మంత్రులు వంగలపూడి అనిత, నిమ్మల రామానాయుడు, ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, సుందరపు విజయకుమార్, పంచకర్ల రమేశ్‌బాబు, బండారు సత్యనారాయణమూర్తి, కేఎస్ఎన్ రాజు, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్, మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందు సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, తదితరులు ఘన స్వాగతం పలికారు. హెలికాప్టర్‌లో ఇక్కడికి వచ్చిన ముఖ్యమంత్రి సుమారు అర కిలోమీటరు దూరంలో ఉన్న అక్విడెక్టు వద్దకు బస్సుపై వెళ్లారు. ముందుగా ముఖ్యమంత్రిని హోం మంత్రి అనిత గజమాలతో సత్కరించారు. హెలిప్యాడ్ నుంచి అక్విడెక్టు వరకు చంద్రబాబుకు దారి పొడవునా అధిక సంఖ్యలో మహిళలు పూలవర్షం కురిపించారు. ముందుగా ఇరిగేషన్ శాఖ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ వద్ద బస్సు దిగిన ముఖ్యమంత్రి అక్కడ ఉన్న ప్రజలకు అభివాదం చేశారు. జర్నలిస్టుల సమస్యలపై చంద్రబాబుకు ఏపీయూడబ్ల్యూజే నాయకులు వినతిపత్రం అందజేశారు. అలాగే పలువురి నుంచి సీఎం వినతులు స్వీకరించారు. అనంతరం అక్విడెక్టు వద్దకు వెళ్లి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, మాజీ ఎంపీపీ యేజెర్ల వినోద్‌రాజు, జనసేన నాయకులు గెద్దం బుజ్జి, టీడీపీ నాలుగు మండలాల అధ్యక్షులు అమలకంటి అబద్ధం, కొప్పిశెట్టి వెంకటేశ్, జానకి శ్రీను, చిట్టిబాబు, సీనియర్ నాయకులు అల్లు నరసింహమూర్తి, గుర్రం రామకృష్ణ, వజ్రపు శంకరరావు, పల్లెల జగ్గారావు, జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మాడుగుల, చోడవరం మధ్య సెజ్

అవసరమైన భూములు పరిశీలించాలి

- అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశం
- విశాఖ రుణం తీర్చుకుంటాం
- విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల అధికారుల సమీక్ష సమావేశంలో సీఎం చంద్రబాబు

విశాఖపట్నం, జూలై 11 (ఆంధ్రజ్యోతి):

మాడుగుల, చోడవరం మధ్యన సెజ్ ఒకటి తీసుకువస్తామని, అందుకు అవసరమైన భూములు పరిశీలించాలని అనకాపల్లి జిల్లా అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తరువాత తొలిసారి జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన గురువారం రాత్రి ఎయిర్‌పోర్టులోని లాంజ్‌లో విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ అభివృద్ధి చేస్తే సంపద పెరుగుతుందని, ఆ సంపదతో సంక్షేమం అందించేలా పాలన ఉండాలని అభిప్రాయపడ్డారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు తరువాత ప్రజల్లో పెద్ద రిలీఫ్ కనిపిస్తోందన్నారు. రైట్‌మెన్‌ను రైట్ ప్లేస్‌లో పెట్టడంపై దృష్టి సారించామని తెలిపారు. విశాఖకు కూటమి ప్రభుత్వం రుణపడి ఉంటుందని ముఖ్యమంత్రి అన్నారు. కూటమిని ఆదరించిన విశాఖను అన్నివిధాలా అభివృద్ధి చేస్తామన్నారు. సబ్బవరం నుంచి షీలానగర్, అక్కడ నుంచి పోర్టు వరకు జాతీయ రహదారుల విస్తరణను వేగవంతం చేయాలన్నారు. రైల్వే జోన్‌కు అవసరమైన భూమి విషయంలో వివాదం ఉందని, వారికి ఆమోదయోగ్యమైన స్థలం ఇచ్చి పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. మెడ్‌టెక్ జోన్‌ను మరింత అభివృద్ధి చేయాలని పేర్కొంటూ ప్రస్తుతం పది వేల కోట్ల వ్యాపారంతో నడుస్తున్న దీనిని రూ.30 వేల కోట్లకు పెంచితే ఎక్కువ మందికి ఉపాధి లభిస్తుందన్నారు.

గంజాయిపై ఉక్కుపాదం

గంజాయిని పూర్తిగా నిర్మూలిస్తామని, ఈ విషయంలో పోలీసులు ఉక్కుపాదం మోపాలని చంద్రబాబు ఆదేశించారు. విశాఖలో గత ఐదేళ్లలో పెద్దఎత్తున భూ ఆక్రమణలు జరిగాయని, ప్రైవేటు వ్యక్తుల వద్ద కూడా బలవంతంగా తీసుకున్నారన్నారు. అటువంటి భూములను తిరిగి సొంతదారులకు ఇప్పించాలన్నారు. భూకబ్జాలు చేసిన వారిపై కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. గత ఐదేళ్లలో వైసీపీ పాలకులు అనేక విధాలుగా ప్రజలను, అప్పటి విపక్షాలను వేధించారన్నారు. అధికారంలోకి వచ్చిన తాము ప్రతీకారం తీర్చుకోబోమని, తమ దృష్టి అభివృద్ధిపై ఉందని అధికారులు, ప్రజాప్రతినిధులకు సంకేతాలిచ్చారు. అదే సమయంలో తమది బ్యూరోక్రసీ గవర్నెన్స్ కాకుండా పొలిటికల్ గవర్నెన్స్ అని స్పష్టంచేశారు. సమీక్షలో కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రులు వంగలపూడి అనిత ... మిగతా 8వ పేజీలో



దార్లపూడిలో పోలవరం ఎడమ కాలువ పరిశీలనకు వెళుతున్న చంద్రబాబుకు పూలుచల్లుతూ ఘనంగా స్వాగతం పలుకుతున్న ప్రజలు

ఆయుష్‌కు ఊపిరి

ఆరేళ్లుగా అసంపూర్తిగా ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ భవన నిర్మాణం

- మూడు నెలల క్రితం నిధులు మంజూరు
- ఊపందుకున్న పనులు



రంగులు వేసి సిద్ధం చేస్తున్న ఆయుష్ శాఖ నేచురోపతి కేంద్రం భవనం

నర్సీపట్నం, జూలై 11:

గత ఆరేళ్లుగా అసంపూర్తిగా దర్శనమిస్తున్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ భవన నిర్మాణ పనులు ఇప్పుడు పునఃప్రారంభమయ్యాయి. రూ.2.5 లక్షలతో ఫినిషింగ్ పనులు వేగంగా జరుగుతున్నాయి.

నర్సీపట్నం ప్రాంతీయ ఆస్పత్రి ఆవరణలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ పేరిట చేపట్టిన ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల భవనం గత ఆరేళ్లుగా అసంపూర్తిగా ఉంది. 2014-19 మధ్య కాలంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆస్పత్రి భవన నిర్మాణానికి ఆయుష్ శాఖ రూ.20 లక్షలు నిధులు మంజూరు చేసింది. అయ్యన్నపాత్రుడు చొరవతో ఏరియా ఆస్పత్రి ఆవరణలో స్థలం కేటాయించారు. ప్రకృతి వైద్యం, యోగా కేంద్రం, రోగులు సేదతీరడానికి పార్కు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. 2017 సంవత్సరంలో అప్పటి కేంద్ర మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు, అప్పటి రాష్ట్ర మంత్రి అయ్యన్నపాత్రుడు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో అనకాపల్లి, నర్సీపట్నంలో మాత్రమే ప్రకృతి వైద్యం, యోగా కేంద్రం భవన నిర్మాణాలు ఉన్నాయి. ప్రకృతి వైద్య కేంద్రంతో పాటు యోగా కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని భావించారు. వైద్యాధికారి, ఫార్మసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్‌ల కోసం మూడు గదులు, పెద్ద హాలు నిర్మించారు. ప్రహరీ గోడ, బోరు, వైరింగ్, రంగులు, ఆస్పత్రి ఆవరణలో పార్కింగ్ టైల్స్ పనులు చేపట్టాల్సి ఉంది. భవన నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్‌కి బిల్లుల బకాయిలు ఉండడంతో అసంపూర్తిగా పనులు ఆపేశారు. వైద్య అధికారి, ఫార్మసిస్ట్, యోగా ఇన్‌స్ట్రక్టర్, సిబ్బంది నియామకాలు చేపట్టలేదు. 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత మిగిలిన పనులకు నిధులు మంజూరు చేయకపోవడంతో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ భవనం పనులు ముందుకు సాగలేదు. అయితే ఆయుష్ శాఖ రూ.2.5 లక్షలు మంజూరు చేయడంతో ఏప్రిల్ నెల నుంచి ఫినిషింగ్ పనులు ప్రారంభమయ్యాయి. కాగా ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం, ఎంట్రన్స్, ఏరియా ఆస్పత్రి వైపు గేట్లు, పార్కింగ్ టైల్స్, హెర్బల్ గార్డెన్, ఆస్పత్రి నుంచి గచ్చపువీధి రోడ్డుని కలుపుతూ సీసీ రోడ్డు నిర్మాణం తదితర పనులకు ఇంజనీరింగ్ అధికారులు రూ.9 లక్షలతో అంచనాలు తయారు చేశారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే ఆయుష్ ఆస్పత్రి, యోగా కేంద్రం అందుబాటులోకి వస్తుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

విశాఖ రేంజ్ డీఐజీగా గోపీనాథ్‌జెట్టి

విశాఖపట్నం, జూలై 11 (ఆంధ్రజ్యోతి):



విశాఖ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ (డీఐజీ)గా గోపీనాథ్‌జెట్టిని నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం డీఐజీగా పనిచేస్తున్న విశాల్‌గున్నీకి ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకుండా డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించింది. 2008 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన గోపీనాథ్ జెట్టి ప్రస్తుతం గ్రేహౌండ్స్ డీఐజీగా పనిచేస్తున్నారు.

బాలిక హత్య కేసులో నిందితుడి ఆత్మహత్య

- ఆమె ఇంటి సమీపంలోని కొబ్బరి తోటలో మృతదేహం
- చనిపోయిన నాలుగైదు రోజులు అయి ఉంటుందని భావిస్తున్న పోలీసులు

... వివరాలు మెయిన్ 2లో



నిందితుడు సురేశ్ (ఫైల్ ఫొటో)

సర్కిల్ పోలీస్ స్టేషన్ భవనానికి మోక్షం కలిగేనా ?

శిథిలావస్థకు చేరడంతో కేవలం రికార్డులు భద్రపరిచేందుకే పరిమితం

- కొత్త భవనం నిర్మిస్తామని అప్పటి హోం మంత్రి సుచరిత అసెంబ్లీలో ప్రకటన
- గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కార్యరూపం దాల్చని వైనం
- కూటమి ప్రభుత్వంలో సమస్య పరిష్కారమవుతుందని ఆశాభావం



శిథిలస్థితిలో ఉన్న చోడవరం పోలీస్ సర్కిల్ కార్యాలయ భవనం

చోడవరం, జూలై 11:

శిథిల స్థితిలో ఉన్న చోడవరం సర్కిల్ పోలీస్ స్టేషన్ భవనానికి కూటమి ప్రభుత్వ హయాంలోనైనా మోక్షం కలుగుతుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి హోం మంత్రి మేకతోటి సుచరిత ఈ పోలీస్ స్టేషన్‌కు నూతన భవనం నిర్మిస్తామని అసెంబ్లీలో ప్రకటించినా అది కార్య రూపం దాల్చలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రావడం, జిల్లాకు చెందిన వంగలపూడి అనిత హోం మంత్రిగా ఉండడంతో సర్కిల్ పోలీస్ స్టేషన్‌కు నూతన భవన నిర్మాణం సాకారమవుతుందనే భావన అందరిలో ఉంది.

పట్టణంలోని సర్కిల్ పోలీస్ కార్యాలయ భవనం స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో నిర్మించినది. గత ఏడాది వరకు చోడవరం, మాడుగుల నియోజకవర్గాలకు ఇదే సర్కిల్ కావడంతో ఈ సర్కిల్ పోలీస్ స్టేషన్ కీలకంగా ఉండేది. అయితే చోడవరం సర్కిల్ నుంచి మాడుగుల నియోజకవర్గం విడిపోయి, కె.కోటపాడులో కొత్త సర్కిల్ కార్యాలయం ఏర్పాటు కావడం, వాటికి కొత్త భవనాలు మంజూరు కావడం నిర్మాణం పూర్తయి గత ఏడాదే ప్రారంభం కావడం గమనార్హం. కానీ ఏళ్ల తరబడి శిథిలమైన గదుల్లో నడుస్తున్న చోడవరం పోలీస్ సర్కిల్ కార్యాలయానికి మాత్రం ... మిగతా 8వ పేజీలో




చాలీచాలని గదులతో ఇరుకుగా ఉన్న టౌన్ పోలీస్ స్టేషన్


దార్లపూడి వద్ద పోలవరం ఎడమ కాలువను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

సీఎం పర్యటన సక్సెస్

ఉమ్మడి జిల్లాలో గురువారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన సూపర్ సక్సెస్ అయింది. తొలుత అనకాపల్లి జిలా ఎస్.రాయవరం మండలం దార్లపూడిలో పోలవరం ఎడమ కాలువను అధికారులతో కలిసి పరిశీలించిన ఆయన, అక్కడి నుంచి విజయనగరం జిల్లా భోగాపురం వద్ద నిర్మిస్తున్న విమానాశ్రయాన్ని పరిశీలించేందుకు వెళ్లారు. తిరిగి మధ్యాహ్నం స్టీల్ ప్లాంటు సమీపానున్న మెడ్‌టెక్ జోన్‌కు చేరుకున్నారు. అక్కడ రెండు కొత్త కంపెనీలను ప్రారంభించి, వివిధ రకాల యంత్రాలు, కార్యకలాపాలను తెలుసుకున్నారు. కార్యక్రమం అనంతరం ఎయిర్‌పోర్టుకు చేరుకుని, అక్కడి వీఐపీ లాంజ్‌లో జిల్లా అధికారులతో అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు.


దార్లపూడి వద్ద ప్రజలకు అభివాదం చేస్తున్న చంద్రబాబు


ముఖ్యమంత్రి చంద్రబాబుకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలుకుతున్న స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు


దార్లపూడి హెలిప్యాడ్ వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఘన స్వాగతం పలుకుతున్న హోం మంత్రి అనిత


ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ..


దార్లపూడి వద్ద అభిమానుల ఉత్సాహం


చంద్రబాబు పర్యటనకు హాజరైన స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఎమ్మెల్యేలు కేఎస్ఎన్ రాజు, కొణతాల రామకృష్ణ, సుందరపు విజయకుమార్


మెడ్‌టెక్ జోన్‌లో నిర్వహించిన పారిశ్రామిక వేత్తల సమావేశంలో చంద్రబాబు


మెడ్‌టెక్ జోన్‌లో కంపెనీని ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు



ఎయిర్‌పోర్టు వీఐపీ లాంజ్‌లో అధికారులతో అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు


హాజరైన విశాఖ, అనకాపల్లి జిల్లా కలెక్టర్లు, ప్రజా ప్రతినిధులు


మెడ్‌టెక్ జోన్‌లోని కంపెనీని పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు

క్రైం... crime news

ప్రమాదవశాత్తూ నేలబావిలో పడి రైతు మృతి

కశింకోట, జూలై 11: మండలంలోని పరవాడపాలెంలో నేల బావిలో నీరు తోడేందుకు వెళ్లి రైతు కర్రి రాజు (48) కాలు జారి పడిపోవడంతో మృతి చెందినట్టు ఏఎస్ఐ శంకరరావు తెలిపారు. రోజూ మాదిరిగానే పంట పొలానికి నేలబావి వద్ద నీరు తోడేందుకు వెళ్లగా ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడిపోయాడు. రాజుకు ఈత రాకపోవడంతో మృతి చెందాడని భార్య పైడమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడుకి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ శంకరరావు తెలిపారు. మృతదేహానికి ఎన్టీఆర్ ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

గంజాయి కేసులో నిందితుడికి జైలు

చోడవరం, జూలై 11: గంజాయి రవాణా కేసులో పట్టుబడిన నిందితుడికి రెండేళ్ల 7 నెలలు జైలు శిక్ష విధిస్తూ స్థానిక 9వ అదనపు జిల్లా కోర్టు జడ్జి గురువారం తీర్పు ఇచ్చారు. తమిళనాడు చెన్నైకి చెందిన ఆర్.ముగుందన్ 2021వ సంవత్సరం నవంబరు 12న వి.మాడుగుల మండలం డి.సురవరం జంక్షన్ వద్ద గంజాయి ప్యాకెట్లతో వస్తుండగా వి.మాడుగుల ఎస్ఐ తన సిబ్బందితో కలిసి నిందితుడిని అరెస్టు చేసి అతని నుంచి 5 కిలోల గంజాయితో పాటు రూ.10 వేలు నగదు స్వాధీనం చేసుకున్నాడు. ఈ కేసు విచారించిన జిల్లా జడ్జి కె.రత్నకుమార్.. నిందితుడు ముగుందన్‌కు రెండేళ్ల ఏడు నెలల జైలుశిక్షతో పాటు వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి.వెంకటరావు పోలీసుల తరపున కేసు వాదించారు.

గోదావరిలో దూకి సబ్బవరం వాసి ఆత్మహత్యాయత్నం

» కాపాడిన ఫైర్ కానిస్టేబుల్

కొవ్వూరు, జూలై 11: గోదావరి నదిలో దూకి ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తిని కొవ్వూరు ఫైర్ కానిస్టేబుల్ రక్షించాడు. అనకాపల్లి జిల్లా సబ్బవరం గ్రామానికి చెందిన చేబ్రోలు వెంకటరమణమూర్తి 25 రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో నిద్ర లేక జీవితంపై విరక్తి చెందాడు. ఈ క్రమంలో కొవ్వూరు గామన్‌బ్రిడ్జి పైనుంచి ఈ నెల 11వ తేదీ రాత్రి గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న రాత్రి గస్తీ నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ఫైర్ సిబ్బందికి సమాచారం అందించాడు. దీంతో అగ్నిమాపక సిబ్బంది స్కూబా డైవ్ మాస్టర్, స్విమ్మింగ్ ట్రైనర్ ఎం.ప్రకాష్‌బాబు రెస్క్యూ బోట్‌తో హుటాహుటిన నదిలోకి వెళ్లి వెంకటరమణమూర్తిని రక్షించి బయటకు తీసుకువచ్చారు. చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. వెంకటరమణమూర్తిని రక్షించిన ప్రకాష్‌బాబును ఫైర్ అధికారి ఏబీఎస్ఎస్ వేణు అభినందించారు.

సాంకేతిక లోపంతో నిలిచిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్

» ప్రత్యామ్నాయ రైలు ఏర్పాటు చేసిన అధికారులు

విశాఖపట్నం, జూలై 11: విశాఖ నుంచి సికింద్రాబాద్ వెళ్లే వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు (20833) గురువారం ఉదయం సాంకేతిక లోపం తలెత్తడంతో స్టేషన్‌లోనే నిలిపివేశారు. ప్రయాణికులు అసహనం వ్యక్తం చేయడంతో డీఆర్ఎం సౌరబ్‌ప్రసాద్‌తోపాటు ఉన్నతాధికారులు స్టేషన్‌కు చేరుకుని ప్రత్యామ్నాయంగా ప్రత్యేక ఏసీ రైలును ఏర్పాటు చేసి, ప్రయాణికులకు ఊరట కలిగించారు. దీంతో ఉదయం 5.45 గంటలకు బయలుదేరాల్సిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్ స్థానంలో 14 థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్‌లతో ప్రత్యేక రైలు ఉదయం ఏడు గంటలకు విశాఖ నుంచి బయలుదేరింది. గురువారం మధ్యాహ్నం సికింద్రాబాద్ నుంచి విశాఖ వచ్చే ప్రయాణికులు కూడా ఈ ప్రత్యామ్నాయ రైలులోనే ప్రయాణించారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	97.00
లైవ్ ధర	117.00
విత్ స్కిన్	204.00
స్కిన్ లెస్	214.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	575
విజయనగరం	579
శ్రీకాకుళం	579

ఆరుగురు విద్యార్థినులకు అస్వస్థత

» వడ్డాది హైస్కూల్‌లో కలకలం

బుచ్చెయ్యపేట, జూలై 11: వడ్డాది జడ్పీ హైస్కూల్‌లో గురువారం పదవ తరగతికి చెందిన ఆరుగురు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. ఉదయం 10.30 గంటల నుంచి 12 గంటల సమయంలో పదవ తరగతికి చెందిన ఆరుగురు విద్యార్థినులు ఒకరి తరువాత మరొకరు అస్వస్థతకు గురై స్పృహ కోల్పోయారు. దీంతో హైస్కూల్‌లో కలకలం రేగింది. విషయం తెలుసుకున్న ఎంఈవో కాశీ విశ్వేశ్వరరావు హైస్కూల్ కి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. విద్యార్థినుల తల్లిదండ్రులకు సమాచారం అందించి అస్వస్థతకు గురైన విద్యార్థినులను స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. వైద్యాధికారిణి డాక్టర్ మౌనిక వీరికి ప్రాథమిక చికిత్స చేసి అనంతరం మెరుగైన వైద్యం కోసం చోడవరం ప్రభుత్వాస్పత్రికి పంపారు. ప్రస్తుతం వీరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, రక్తహీనత, మానసిక ఒత్తిడి కారణంగా విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారని వైద్యులు తెలిపారు. వారి ఆరోగ్యం కుదుట పడడంతో ఇళ్లకు పంపించినట్టు హెచ్ఎం శేషుబాబు తెలిపారు.


చోడవరంలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

27, 28 తేదీల్లో ఎస్ఎఫ్ఐ ప్లీనరీ



ప్లీనరీ పోస్టర్‌ను ఆవిష్కరించిన రామ్మోహన్

అనకాపల్లి టౌన్, జూలై 11: పట్టణంలో ఈనెల 27, 28 తేదీల్లో జరిగే ఎస్ఎఫ్ఐ ప్లీనరీ సమావేశాలు విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి. రామ్మోహన్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక దొడ్డి రామునాయుడు భవనంలో జరిగిన సమావేశంలో ప్లీనరీ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. నీట్ ప్రశ్నపత్రం అవకతవకలపై వివిధ రూపాల్లో అనేక కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టేందుకు విద్యార్థులు పోరాడాలని పిలుపునిచ్చారు. అనకాపల్లి జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజి ఏర్పాటు చేయాలని, ఇందుకు అవసరమైతే పోరాటం చేస్తామన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జి. గీతాకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎం.రమణ, సభ్యులు ఎస్.రమణ, కె.ఆదికేశవ, అభిషేక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ప్రణాళిక

» ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్



విశాఖపట్నం, జూలై 11: సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టామని ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలకు అనుగుణంగా సంస్థ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమండ్రి, ఏలూరు సర్కిళ్ల పరిధిలోని పర్యవేక్షక ఇంజనీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లతో టెలీకాన్ఫరెన్సు నిర్వహించి పలు సూచనలిచ్చామన్నారు. జిల్లాల వారీగా తరచూ ఏర్పడుతున్న అంతరాయాలను గుర్తించేందుకు 33 కేవీ ఫీడర్స్, 11 కేవీ ఫీడర్స్ ఎంపిక చేసుకుని, వాటిని సర్వేచేసి లోపాలను పీఎంఐ సర్వే మొబైల్ యాప్‌లో నమోదు చేస్తారన్నారు. సంస్థ పరిధిలోని ఐదు సర్కిళ్లలో గురువారం ఫీడర్లను సర్వే చేశామన్నారు. సమస్యలను టోల్‌ఫ్రీ నంబరు 1912కు తెలియజేస్తే సకాలంలో పరిష్కరిస్తామని ఆయన తెలిపారు.

పోలవరం కాలువ అలైన్‌మెంట్ మార్చాలి

» ముఖ్యమంత్రికి వంగలి సర్పంచ్ వినతి

సబ్బవరం, జూలై 11: మండలంలోని వంగలి గ్రామం మీదుగా వెళుతున్న పోలవరం (బాబూ జగ్జీవన్‌రామ్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి) కాలువ అలైన్‌మెంట్‌ను మార్చాలని ఆ గ్రామ సర్పంచ్ ఆకుల శ్రీహేమ గురువారం అనకాపల్లి జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోలవరం కాలువ తమ గ్రామంలో ఉన్న వ్యవసాయ భూముల్లో నుంచి వెళుతుందని, ఇప్పటికే గ్రామంలో రైతులు సాగు చేసుకుంటున్న భూములు ఇండియన్ మారిటైం వర్సిటీ, పెట్రోవర్సిటీ, స్కిల్ డెవలప్‌మెంట్ వర్సిటీలకు వందలాది ఎకరాలు ప్రభుత్వం సేకరించిందన్నారు. కొద్దిపాటి భూములు మాత్రమే రైతులు సాగు చేసుకునేందుకు మిగిలాయని, ఇప్పుడు ఆ కాస్త భూముల్లో నుంచే పోలవరం కాలువ వెళ్లే తమ గ్రామం ఖాళీ అవుతుందని, రైతులు సాగు చేసుకునేందుకు ఎటువంటి భూములు ఉండవని వినతిపత్రంలో వివరించారు.

రేషన్ బియ్యం అక్రమ తరలింపుపై ఫిర్యాదు

» ఆటోలో 800 కిలోల బియ్యాన్ని తరలిస్తుండగా అడ్డుకున్న సర్పంచ్

రోలుగుంట, జూలై 11: మండలంలోని పలు గ్రామాల్లో రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది. రొంగలిపాలెంలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండడాన్ని స్థానిక యువకులు గుర్తించి సర్పంచ్ లోవరాజుకు తెలియజేశారు. గ్రామానికి చెందిన రొంగలి రమణ అనే కిరాణా వ్యాపారి గురువారం ఉదయం ఆటోలో 800 కేజీల బియ్యాన్ని తరలిస్తుండగా సర్పంచ్ లోవరాజు, తదితరులు గుర్తించి అడ్డుకున్నారు. దీనిపై రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు.

ఇద్దరు ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లపై క్రిమినల్ కేసులు

పాయకరావుపేట, జూలై 11: మండలంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు దుర్వినియోగానికి పాల్పడిన నామవరం, ఈదటం ఫీల్డ్ అసిస్టెంట్లపై క్రిమినల్ కేసులు నమోదుచేయాలని పోలీసులను కోరినట్టు ఎంపీడీఓ కె.స్వప్న తెలిపారు. గురువారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ.. గడచిన ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులు చేపట్టారన్నారు. ఈ పనులపై ఇటీవల సామాజిక తనిఖీ బృందాలు నిర్వహించిన 16వ విడత సోషల్ ఆడిట్‌లో నామవరం ఫీల్డ్ అసిస్టెంట్ రామస్వామి రూ.5,22,900, ఈదటం ఫీల్డ్ అసిస్టెంట్ సోమయ్య రూ.7,06,075 బినామీ మస్తర్లతో పనులు చేయకుండా బిల్లులు కాజేశారని తేలడంతో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఈ ఇద్దరిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నట్టు ఆమె తెలిపారు.

వామనావతారంలో జగన్నాథస్వామి


వామనావతారంలో జగన్నాథస్వామి

అనకాపల్లి టౌన్, జూలై 11: స్థానిక ఇంద్రద్యుమ్నా హాల్‌లో కొలువైన సుభద్ర బలభద్ర సమేత జగన్నాథస్వామి గురువారం భక్తులకు వామనావతారంలో దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు బంకుపల్లి సత్యనారాయణ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఛైర్మన్ దాడి బుజ్జి, ఈవో రాజసులోచన, కమిటీ సభ్యులు చర్యలు చేపట్టారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

మాకవరపాలెం, జూలై 11: మండలంలో పెద్దిపాలెం గ్రామంలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేపట్టారని, దానిని తొలిగించాలని కలెక్టర్‌కు ఇటీవల గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ మురళీమోహన్‌రావు అక్రమ నిర్మాణం తొలగించాలని ఆక్రమణదారుడిని హెచ్చరించారు. పెద్దిపాలెం గ్రామంలో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యలకు పరిష్కారం

▸ సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ సత్యనారాయణ వెల్లడి

▸ సబ్బవరంలో విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక నిర్వహణ



అర్జీలు స్వీకరిస్తున్న చైర్‌పర్సన్

సబ్బవరం, జూలై 11 : విద్యుత్ వినియోగదారులు తమ సమస్యల పరిష్కారానికి కోర్టులను ఆశ్రయించాల్సిన అవసరం లేదని, సమస్యలను పరిష్కార వేదిక దృష్టికి తీసు కొస్తే ఎటువంటి ఖర్చు లేకుండా సకాలంలో పరిష్కరిస్తామని సీజీఆర్ఎఫ్ చైర్ పర్సన్, రిటైర్డ్ జిల్లా జడ్జి బి.సత్యనారాయణ తెలిపారు. ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో గురువారం కశింకోట సబ్ డివిజన్ పరిధిలో గల విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదికను సబ్బవరంలో నిర్వహించారు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించేందుకే ఇటువంటి వేదికలను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. అధిక బిల్లులు, బకాయిల వసూలు, లోపాలు కలిగిన మీటర్లు, కాలిపోయిన మీటర్లు, సరఫరాలో అంతరాయం, హై, లోఓల్టేజీ, సిబ్బంది సేవా లోపాలు, కొత్త కనెక్షన్లు జారీలో జాప్యం తదితర సమ స్యలపై పరిష్కార వేదికను ఆశ్రయించవచ్చునని వివరించారు. ఇప్పటి వరకూ 8027 దరఖాస్తులు రాగా,7905 పరిష్కరించినట్టు చెప్పారు. అనంతరం సంస్థ సభ్యులు ఎంశ్రీ నివాస్, వి.జనార్ధన రావు, డాక్టర్ ఆర్.సురేంద్ర, ఏపీఈపీడీసీఎల్ డీఈ ఎస్.రామకృష్ణ, ఏడీఈ నిరంజన్ అంబేడ్కర్, ఏఈలు వీరేంద్ర, అశోక్, ఏఏవో భవానీలు అర్జీలు స్వీకరించారు.

మాడుగుల, చోడవరం మధ్య సెజ్

... 5వ పేజీ తరువాయి

టీజీ భరత్, గుమ్మడి సంధ్యారాణి, ఎంపీలు ఎం.శ్రీభరత్, సీఎం రమేష్, గాజువాక, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, పి.గణబాబు, విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్, హరేంధిర్ ప్రసాద్ వేదికపై ఉన్నారు. ఇంకా ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, వేపాడ చిరంజీవిరావు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, విష్ణుకుమార్‌రాజు, పంచకర్ల రమేష్‌బాబు, బండారు సత్యనారాయణమూర్తి, సుందరపు విజయకుమార్, కేఎస్ఎన్ఎస్ రాజు, సీపీ శంఖబ్రత బాగ్చి, ప్రభుత్వ కార్యదర్శులు సునీత, అహ్మద్‌బాబు, అనకాపల్లి కలెక్టర్ విజయకృష్ణన్, టీడీపీ నేతలు గండి బాబ్జీ, సీతంరాజు సుధాకర్, పీలా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'లులు' ప్రతినిధులతో చర్చిస్తాం

గతంలో తమ ప్రభుత్వ హయాంలో అనుమతులు మంజూరుచేసిన లులు మాల్‌ను ఆర్కే బీచ్‌రోడ్డులో ఏర్పాటుచేసేందుకు ప్రయత్నిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. ఆ సంస్థ ప్రతినిధులతో చర్చిస్తామన్నారు. అదేవిధంగా గాజువాకలో హిందుస్థాన్ జింక్ కర్మాగారం ప్రాంతంలో బిజినెస్ సెంటర్ ఏర్పాటుకు గతంలోనే వేదాంత సంస్థతో ఒప్పందం జరిగిందని, అయితే వైసీపీ ప్రభుత్వం దానిని పూర్తిగా పక్కనపెట్టేసిందన్నారు. దానిని తిరిగి పట్టాలెక్కించేందుకు చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి తెలిపారు. వీఎంఆర్‌డీఏ రూపొందించిన మాస్టర్‌ప్లాన్‌లో వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇష్టానుసారంగా మార్పులు చేశారని సీఎం అన్నారు. అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేలా మాస్టర్‌ప్లాన్‌ను తయారుచేయాలని అధికారులను ఆదేశించారు.

సర్కిల్ స్టేషన్ భవనానికి మోక్షం కలిగేనా?

... 5వ పేజీ తరువాయి

మోక్షం లభించలేదు. ఈ కార్యాలయం నుంచి మాడుగుల సర్కిల్ విడిపోవడంతో ప్రస్తుతం ఈ భవనాన్ని రికార్డులు భద్రపరచడానికి మాత్రమే ఉపయోగిస్తున్నారు.

చాలీచాలని గదుల్లో అవస్థలు

ప్రస్తుతం టౌన్ సర్కిల్ భవనంలోనే సీఐ, ఎస్ఐలు, ఇతర సిబ్బంది సర్దుకుని ఉండవలసిన పరిస్థితి నెలకొంది. ఈ చిన్న భవనంలోనే సీసీ కెమెరాల ఫుటేజీ నిక్షిప్తం చేసే గది, ఎస్ఐలు, స్టేషన్ రైటర్ గది, ఖైదీల సెల్, పట్టుబడిన గంజాయి, ఇతర నిషేధ వస్తువులను నిల్వ ఉంచే వరండాలతో స్టేషన్ మరింత ఇరుకుగా మారింది. ఎక్కువ మందిని ఏదైనా కేసులో పోలీస్ స్టేషన్‌కు తీసుకుని వస్తే, వారిని ఎక్కడ ఉంచాలో కూడా తెలియని పరిస్థితి ఉంది. పోలీస్ స్టేషన్ ఆవరణలోనే ఒక పక్క సీజ్ చేసిన వాహనాలు ఉంచడంతో మరింత ఇరుకుగా మారింది. ఇక స్టేషన్ పక్కన ఉన్న ప్రదేశంలో సీజ్ చేసిన ఇసుక కుప్పలు, కేసుల్లో పట్టుబడిన వాహనాలతో పేరుకుపోయింది. పాత సర్కిల్ కార్యాలయం భవనం వెనుకన అంతా తుప్పలు పేరుకుపోయి అధ్వానంగా ఉంది. ఈ పోలీస్ స్టేషన్ భవనాల స్థానంలో పక్కా భవనాలు నిర్మించాలంటూ గతంలో పోలీస్ అధికారులు ఎన్ని ప్రతిపాదనలు పంపించినా, ఇప్పటికీ వాటికి మోక్షం కలగలేదు. ఈ సమస్యను గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అసెంబ్లీలో ప్రస్తావించడం, దానికి అప్పటి హోం మంత్రి సుచరిత స్పందించి సర్కిల్ పోలీస్ స్టేషన్‌కు కొత్త భవనం నిర్మిస్తామని ప్రకటించడంతో కష్టాలు తీరతాయని అంతా భావించారు. అయితే ఇప్పటి వరకు ఎటువంటి పురోగతి లేదు. కూటమి ప్రభుత్వ హయాంలోనైనా ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని పోలీసులు ఆశిస్తున్నారు.






చంద్రబాబుకు ఘన స్వాగతం



ఎస్.రాయవరం మండలం దార్లపూడి వద్ద పోలవరం ఎడమ కాలువ పరిశీలనకు గురువారం విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు పలువురు నేతలు ఘన స్వాగతం పలికారు. అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, సుందరపు విజయకుమార్, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు, టీడీపీ విశాఖ జిల్లా మాజీ అధ్యక్షుడు దాడి రత్నాకర్ తదితరులు పుష్పగుచ్ఛాలను అందజేసి స్వాగతం పలికారు. ప్రతి ఒక్కరినీ చంద్రబాబు ఆత్మీయంగా పలుకరించారు. ఇదిలావుంటే, సీఎం పర్యటన సందర్భంగా వివిధ మండలాల నుంచి పెద్దసంఖ్యలో టీడీపీ శ్రేణులు దార్లపూడి చేరుకున్నారు. దీంతో కోలాహల వాతావరణం నెలకొంది.

అన్ని రంగాల్లో మునిసిపాలిటీ అభివృద్ధి : ఎమ్మెల్యే



రామ్మూర్తినగర్‌లో రోడ్డు నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సుందరపు

ఎలమంచిలి, జూలై 11 : మునిసిపాలిటీని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యమని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. ఇక్కడి రామ్మూర్తినగర్‌లో పదిహేనవ ఆర్థిక సంఘం నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు చైర్‌పర్సన్ రమాకుమారితో కలిసి గురువారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. మునిసిపల్ కమిషనర్ ప్రభాకరరావు, వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, గుప్తా, జనసేన, టీడీపీ నాయకులు బొద్దపు శ్రీను, గొర్లె నానాజీ, పిట్టా శ్రీను, కొఠారు సాంబ, గుర్రాల శేఖర్, ఊడి బాబులు, కొఠారు శ్రీను, కొఠారు నరేష్, పల్లా సత్యనారాయణ, చిట్టిబాబులు పాల్గొన్నారు.

మోటారు వాహనాల చట్టంపై అవగాహన



చట్టంపై అవగాహన కల్పిస్తున్న జడ్జి వీరరాఘవేంద్రరావు

ఎలమంచిలి, జూలై 11 : మోటారు వాహనాల చట్టంపై పట్టణంలోని కోర్టుల సముదాయంలో గురువారం అవగాహన సదస్సు ఏర్పాటైంది. అదనపు జూనియర్ సివిల్ జడ్జి టి.వీరరాఘవేంద్రరావు ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ కార్యక్రమంలో భారత న్యాయ వ్యవస్థలో వచ్చి కొత్త చట్టాలను ఆయన వివరించారు. ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధారణ వల్ల కలిగే ప్రయోజనాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. వాహనం నడిపేటప్పుడు విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. పద్దెనిమిది సంవత్సరాలలోపు మైనర్లు వాహనం నడిపితే వారి తల్లిదండ్రులకు శిక్షలు తప్పవని స్పష్టం చేశారు. ప్యానెల్ న్యాయవాది కె.ఎస్.దుర్గా ప్రసాద్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

కోలుకుంటున్న ఇంజక్షన్ రియాక్షన్ రోగులు

▸ నక్కపల్లి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శిరీషా



డాక్టర్ శిరీషా

నక్కపల్లి, జూలై 11 : మండల కేంద్రం నక్కపల్లిలోని యాభై పడకల ఆస్పత్రిలో మంగళవారం రాత్రి ఇంజక్షన్ రియాక్షన్ వచ్చి అస్వస్థతకు గురైన వారంతా కోలుకున్నారని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.శిరీషా తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ 23 మంది రోగులకు సిపిటాక్జిమ్ ఇంజక్షన్లు రియాక్షన్ రావడంతో అస్వస్థతకు గురవ్వగా, ఒకరిని విశాఖ కేజీహెచ్‌కు తరలించగా, 21 మందిని అనకాపల్లి ఆస్పత్రికి తరలించామన్నారు. ఒక బాలిక తమ ఆస్పత్రిలోనే ఉండిపోయిందన్నారు. వీరంతా క్షేమంగా ఉన్నారని, ప్రస్తుతం అనకాపల్లి ఆస్పత్రిలో చిన్నారులతో కలిసి మొత్తం ఆరుగురు మాత్రమే ఉన్నారని, మిగిలిన వారంతా ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యారని వివరించారు.

డీఎల్‌పురంలో సాగుదారులకు న్యాయం చేయాలి

నక్కపల్లి, జూలై 11 : మండలంలోని డీఎల్‌పురం రెవెన్యూ పరిధి సర్వే నెంబరు 85/1 నుంచి 85/6 సర్వే నెంబర్లలో ఉన్న సుమారు 102 ఎకరాల భూములను పూర్వం నుంచి పేదలు సాగు చేసుకుంటున్నారని, ఈ భూములను కారిడార్ కోసం సేకరిస్తున్నందున సాగుదారులకు నష్టపరిహారం ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. గురువారం డీఎల్‌పురంలో సాగుదారులతో కలిసి ఆయన సదరు భూములను పరిశీలించారు. ఈ భూముల సాగుదారులుగా ఉన్న వారందరికీ 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం, ప్యాకేజీ ఇవ్వాలన్నారు. సాగుదారులకు ఈ భూములు తప్ప ఎటువంటి ఆధారం లేదని పేర్కొన్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించాలని కోరారు. రైతు సంఘం ప్రతినిధులు గింజాల వెంకట రమణ, ఎం.సత్యనారాయణ, ఎం.రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మునిసిపల్ కౌన్సిల్ సమావేశం

ఎలమంచిలి, జూలై 11 : మునిసిపల్ కౌన్సిల్ సమావేశం శుక్రవారం ఇక్కడ జరగనుంది. ఉదయం పదకొండు గంటలకు చైర్‌పర్సన్ రమాకుమారి అధ్యక్షతన సమావేశం ప్రారంభం కానున్నట్టు కమిషనర్ ప్రభాకరరావు తెలిపారు. అభివృద్ధి పనులపై చర్చించనున్న ఈ సమావేశానికి కౌన్సిలర్లతో పాటు ఆయా శాఖల అధికారులు విధిగా హాజరు కావాల్సిందిగా ఆయన కోరారు.

140 మందికి వైద్య పరీక్షలు



రోగులకు పరీక్షలు జరుపుతున్న వైద్య సిబ్బంది

పాయకరావుపేట, జూలై 11 : వాకర్స్ హెల్త్ క్లబ్ శుక్రవారం ఇక్కడ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించింది. తొలుత ఈ శిబిరాన్ని వాకర్స్ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ చదరం శివాజీ ప్రారంభించారు. అనంతరం ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ నితీష్‌సింగ్, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ విజయరాజా, హైమా నేత్రాలయం వైద్య నిపుణులు డాక్టర్ శివరాజప్రసాద్ తదితరులు 140 మందికి పరీక్షలు జరిపి, మందులు అందజేశారు. వాకర్స్ క్లబ్ ప్రతినిధులు కుందెం సత్యనారాయణ, డీఎస్ మూర్తి, కండవల్లి జోసెఫ్, బీవీడీ ప్రసాద్, వడ్డాది ఆదిత్య, యోగా మాస్టర్ వేములూరి ప్రసాద్, పి.శివ, వాడపల్లి శ్రీను, కొమ్మోజు గౌరీశంకర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కశింకోట, జూలై 11 : మండలంలోని తాళ్లపాలెం సెక్షన్ 33/11కేవీ, కన్నూరుపాలెం సబ్ స్టేషన్‌పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం పలు గ్రామాల్లో విద్యుత్‌కు అంతరాయం కలగనుందని విద్యుత్ శాఖ ఈఈ ఎస్.రామకృష్ణ తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం పన్నెండు గంటల వరకు నర్సింగబిల్లి, ఎన్.జి.పాలెం, గొబ్బూరు, తాళ్లపాలెం, పరవాడపాలెం, ఉగ్గినపాలెం, కొత్తపల్లి, ఏఎస్‌పేట, సోమవరం, కన్నూరుపాలెం, తీడ, చెరకాం, సుందరయ్యపేట, జి.భీమవరం, అచ్చెర్ల, మోసయ్యపేట, ఏనుగుతుని గ్రామాల్లో సరఫరా ఉండదన్నారు.

అచ్యుతాపురం : విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా కొండకర్ల సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని డీఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. ఈ కారణంగా పెదపాడు, తిమ్మరాజుపేట, హరిపాలెం, ఖాజీపాలెం, జగ్గన్నపేట పంచాయతీల పరిధిలోని గ్రామాలకు ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు వరకు సరఫరా ఉండదన్నారు.

పాయకరావుపేట/రూరల్ : పట్టణంలోని విద్యుత్ సబ్ స్టేషన్ పరిధి చక్కానగర్ ఫీడర్ వార్షిక నిర్వహణలో భాగంగా శుక్రవారం ఉదయం ఐదు గంటలు సరఫరాలో అంతరాయం కలుగనుందని అనకాపల్లి డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. ఫీడర్ పరిధిలో చెట్లకొమ్మలు తొలగింపు, మరమ్మతులు చేపట్టనున్నందున ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పెదిరెడ్డి లక్ష్మీనగర్, దేవీనగర్, చక్కానగర్, ఆనంద్‌నగర్ కాలనీ, ప్రకాష్ విద్యా సంస్థల ఏరియా, దొరకాలనీతో పాటు పీఎల్‌పురం, సీతారాంపురం, నామవరంలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. సత్యవరం సబ్ స్టేషన్ పరిధిలో చేపట్టనున్న పనుల కారణంగా సత్యవరం, మాసాహెబ్‌పేటలో ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం పన్నెండు గంటల వరకు, పాల్మన్‌పేట విద్యుత్ కేంద్రం వెంకటనగరం ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగింపులో భాగంగా ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సరఫరా నిలిపివేస్తామని డీఈఈ కె.రాజశేఖర్ తెలిపారు.

జిల్లాకు బాబు వరాలు

... 5వ పేజీ తరువాయి

పూర్తిచేసి, అనకాపల్లి జిల్లాలో మొత్తం 2 లక్షల 80 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు.

షుగర్ ఫ్యాక్టరీల సమస్యకు శాశ్వత పరిష్కారం

జిల్లాలో వైసీపీ ప్రభుత్వ హయాంలో మూతపడిన మూడు షుగర్ ఫ్యాక్టరీల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ఎన్‌డీఏ ప్రభుత్వం అడుగులు వేస్తోందని చంద్రబాబు తెలిపారు. షుగర్ ఫ్యాక్టరీలను స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేల సహకారంతో ఇథనాల్ ఉత్పత్తి కేంద్రాలుగా మార్చి చెరకు రైతులకు న్యాయం చేయడమే ఎన్‌డీఏ లక్ష్యమన్నారు.

వాడవాడలా జనాభా దినోత్సవ ర్యాలీలు



అనకాపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది



అచ్యుతాపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో...



కశింకోట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో...



రాంబిల్లి మండలం దిమిలి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో...

అనకాపల్లి టౌన్, జూలై 11 : ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా వైద్యులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా అనకాపల్లి పట్టణంలోని ఎన్టీఆర్ వైద్యాలయం నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా ఈ ర్యాలీ సాగింది. జిల్లా ఎంహెచ్ఎన్ నోడల్ అధికారి డాక్టర్ చంద్రశేఖర్‌దేవ్ మాట్లాడుతూ జనాభా పెరగడం వల్ల అనేక సవాళ్లు ఎదురవుతాయన్నారు. వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని వివరించారు. గణాంక అధికారి ఎ.రామచంద్రరావు, ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కశింకోట: కుటుంబ నియంత్రణ పద్ధతులపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ తిరుపతిరావు సూచించారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. ఆరోగ్య విస్తరణాధికారి సత్యనారాయణ, సత్యవతి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఇక్కడ పీహెచ్‌సీ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి కె.శ్రావ్య అధిక జనాభా వల్ల అనర్థాలను వివరించారు. సీహెచ్‌వో వేణుగోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

రాంబిల్లి : ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా దిమిలి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఆర్. వెంకటేశ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. జనాభా పెరుగుదల వల్ల ఉత్పన్నమయ్యే సమస్యలు, సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆరోగ్య విస్తరణాధికారి ఎస్ఎస్‌వీఎన్ రాజు, ఆరోగ్య పర్యవేక్షకులు సిహెచ్.ధనరాజు, పీహెచ్‌సీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



జలగలమదుం జంక్షన్ వద్ద అదుపుతప్పిన లారీ

అనకాపల్లి టౌన్, జూలై 11 : ఇక్కడి జాతీయ రహదారిలో గురువారం తెల్లవారుజామున త్రుటిలో ప్రమాదం తప్పింది. విశాఖ నుంచి అచ్యుతాపురం బ్యాటరీ పౌడరు లోడుతో వెళుతున్న లారీ జలగలమదుం జంక్షన్ వద్ద అదుపుతప్పి రోడ్డు కిందకు దిగిపోయింది. దీంతో క్యాబిన్‌లో ఉన్న డ్రైవర్, క్లీనర్ లారీ అద్దాలను పగులగొట్టి బయటకు వచ్చినట్టు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

ఇంటిపై పడిన కొబ్బరి చెట్టు



అందలాపల్లిలో వైర్లతో సహా ఇంటిపై పడిన చెట్టు

అచ్యుతాపురం, జూలై 11 : అందలాపల్లిలోని ఓ ఇంటిపై శుక్రవారం మధ్యాహ్నం కొబ్బరి చెట్టు విరిగి పడింది. తొలుత ఇది విద్యుత్ వైర్లపై పడి, ఆ వైర్లతో సహా ఇంటిపై పడడంతో అంతా ఆందోళన చెందారు. ఆ సమయంలో మేడపై ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లైంది. గ్రామస్థులు విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించడంతో వారు సరఫరాను నిలిపివేసి, చెట్టును తొలగించారు.

69వ సారి రక్తదానం చేసిన లాలం చందు



రక్తదానం చేస్తున్న చందు

రాంబిల్లి/ అచ్యుతాపురం, జూలై 11: సినీ హీరో మెగాస్టార్ చిరంజీవి బ్లడ్‌బ్యాంక్‌లో గురువారం రాంబిల్లి మండలం లాలం కోడూరుకు చెందిన జనసేన పార్టీ నియోజకవర్గ నాయకుడు లాలం చందు రక్తదానం చేశారు. అనంతరం ఆయన ఇక్కడి విలేకరులతో ఫోన్‌లో మాట్లాడుతూ తాను 69వ సారి రక్తదానం చేసినట్టు చెప్పారు. రక్తదానం ద్వారా అపదలో ఉన్న వారికి ప్రాణదానం చేసే అవకాశం ఉంటుందన్నారు. తాను ఏటా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి, రక్తదానం చేయడంతో పాటు, అవకాశం ఉన్న వారిచేత కూడా రక్తదానం చేయిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి పర్సనల్ మేనేజర్ గంగాధర్ పాల్గొన్నారు.

గౌరవ వేతనం కోసం వలంటీర్లు ఆందోళన

సబ్బవరం, జూలై 11 : పెండింగ్‌లో ఉన్న మూడు నెలల గౌరవ వేతనాన్ని తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని ఇరవై సచివాలయాల పరిధిలో పని చేస్తున్న వలంటీర్లు ఇక్కడి ఎంపీడీవో కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపీపీ బోకం సూర్యకుమారి వద్ద తమ గోడును వినిపించారు.

ఘనంగా కన్నబాబురాజు జన్మదిన వేడుకలు



ఎలమంచిలిలో కేక్‌కట్ చేస్తున్న ఎంపీపీ తదితరులు

ఎలమంచిలి, జూలై 11 : మాజీ ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తి రాజు (కన్నబాబు) జన్మదిన వేడుకలను గురువారం ఇక్కడ వైసీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో ఎంపీపీ బోదెపు గోవింద్, ఏఎంసీ చైర్మన్ బొద్దపు యర్రయ్యదొర కేక్ కట్‌చేసి, స్వీట్లు పంచిపెట్టారు. మునిసిపల్ వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, అర్రెపు గుప్తా, నాయకులు కర్రి శివ, కొల్లి త్రినాథ్, గొర్లె వెంకట్, కోడిగుడ్డు రమణబాబు, పడాల శ్రీను పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు రాజు జన్మదిన వేడుకలను అచ్యుతాపురం వైసీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ శ్రేణులు కేక్ కట్‌చేశారు. నాయకులు కోన బుజ్జి, మారిశెట్టి సూర్యనారాయణ, దేశంశెట్టి శంకరరావు, పిన్నమరాజు వాసు, వడిసెల శ్రీనివాసరావు, శనివాడ జువ్వాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం జంక్షన్‌లో చురుగ్గా రోడ్డు విస్తరణ పనులు



జంక్షన్‌లో భారీ భవనాన్ని తొలగిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం, జూలై 11 : మండల కేంద్రం అచ్యుతాపురం జంక్షన్‌లో రోడ్డు విస్తరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. అచ్యుతాపురం-పూడిమడక, అచ్యుతాపురం-ఎలమంచిలి ఈ రెండు రోడ్లను కలుపుకొని జంక్షన్‌లో నాలుగు అంతస్తుల భారీ భవనం ఉంది. దీనిని పది రోజుల నుంచి యంత్రాల సహాయంతో తొలగిస్తున్నారు అయినా కొలిక్కి రాలేదు. భారీ భవనం కావడంతో రెండురోడ్లలో పోలీసులు బారికేడ్‌లు ఏర్పాటు చేసి ప్రజలు, వాహనాలు అటుపక్కకు వెళ్లకుండా నిరోధిస్తున్నారు. భవనం మొత్తం కూల్చిన తర్వాత వ్యర్థాలు ఒకేసారి తరలించాలని అధికారులు భావిస్తున్నారు. ఇదే విధంగా గాజువాక రోడ్డులో కూడా రోడ్డు విస్తరణ పనులు జరగుతున్నాయి. అలాగే జంక్షన్ మధ్యలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయాన్ని ఎక్కడకు తరలించాలా.. అనే అంశంపై అధికారులు ఆలోచనలో పడ్డారు.

నర్సీపట్నం
నియోజకవర్గం

విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ



సైకిళ్లు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

నర్సీపట్నం, జూలై 11 : ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సైకిళ్లు పంపిణీ చేపట్టారు. గురువారం లయన్స్ క్లబ్ గవర్నర్ డాక్టర్ అధికారి గోపాలరావు, పూర్వపు గవర్నర్ దస్త్రాల రాఘవేంద్రరావు చేతుల మీదుగా 35 మంది విద్యార్థులకు రూ.2.10 లక్షలు విలువ చేసే సైకిళ్లు అందజేశారు. దూర ప్రాంతాల నుంచి ప్రతీ రోజు క్రమం తప్పకుండా కళాశాలకు వచ్చి, బాగా చదువుతున్న 35 మంది విద్యార్థినులను సైకిళ్లు అందజేయడానికి ఎంపిక చేశామని లయన్స్ క్లబ్ గవర్నర్ డాక్టర్ అధికారి గోపాలరావు తెలిపారు. మిగిలిన విద్యార్థులు కూడా బాగా చదువుకోవాలని సూచించారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన అధికారి పూజిత, ఎల్.వందన, ఎస్.హరిత, జి.శ్రీ సాయి పవన్‌కుమార్, ఎన్.స్ఫూర్తి, పి.బిందుశ్రీలకు ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున ప్రోత్సాహక నగదు పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమంలో నవ్య లయన్స్ క్లబ్ ప్రతినిధి సన్యాసిపాత్రుడు, ప్రిన్సిపాల్ పద్మావతి, అధ్యాపకులు శర్మ, చిన్నారావు, లైబ్రేరియన్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విత్తన ఎంపికే కీలకం


సమావేశంలో సూచనలు అందిస్తున్న జలవనరుల కేంద్రం ఏడీఏ శ్రీధర్, పాల్గొన్న రైతులు

గొలుగొండ, జూలై 11 : మండలంలోని కొత్తమల్లంపేటలో గురువారం జిల్లా వనరుల కేంద్రం ఆత్మ ఆధ్వర్యంలో రైతులకు ఖరీఫ్ పంటల సాగుపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా జలవనరుల కేంద్రం ఏడీఏ శ్రీధర్ మాట్లాడుతూ రైతులు వ్యవసాయసాగులో సరైన విత్తనం ఎంపిక చేసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. విత్తన శుద్ధి వల్ల పంటలు తెగుళ్ల తట్టుకుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఏవో కె.సుధారాణి, వ్యవసాయాధికారులు శ్రీదేవి, చిరంజీవి, విజేత, సీహెచ్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



కృష్ణాదేవిపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు హరిప్రవీణ్, గాయత్రి


ప్రపంచ జనాభా సంఖ్యను బోర్డుపై చూపుతున్న ఉపాధ్యాయులు

జనాభా నియంత్రణపై అవగాహన ర్యాలీలు

అంతర్జాతీయ జనాభా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు

కృష్ణాదేవిపేట, జూలై 11 : ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం వైద్యాధికారులు హరిప్రవీణ్, గాయిత్రి, వైద్య సిబ్బంది గురువారంఅవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక పీహెచ్‌సీ నుంచి మెయిన్‌రోడ్డు చివర వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం వైద్యాధికారి ఎస్.హరిప్రవీణ్ మాట్లాడుతూ పరిమిత కుటుంబం వల్ల ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి ఉండదన్నారు.కుటుంబ నియత్రణపై అందరిలో అవగాహన ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ సావిత్రి, ఎంపీహెచ్ఈవో సత్యనారాయణ, హెచ్‌వీలు వరలక్ష్మి, నాగమణి, ప్రశాంతి, లక్ష్మి ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మాకవరపాలెంలో..

మాకవరపాలెం : మండలంలో తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రపంచ జనాభా దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోసూరు రాము మాట్లాడుతూ గురువారం నాటికి ప్రపంచ జనాభా 144 కోట్లకు చేరిందన్నారు. జనాభా పెరగడం వల్ల అనార్థాలు ఎదురవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లోవరాజు, సంతోషి, నారాయణరావు పాల్గొన్నారు.

గొలుగొండలో..

గొలుగొండ : ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గొలుగొండ, చీడిగుమ్మల పీహెచ్‌సీ వైద్యాధికారి శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ కాన్పుల మధ్య ఎడం పాటించడం తల్లిబిడ్డలకు ఎంతో ఆరోగ్యమన్నారు. బాల్య వివాహాలు అనర్థదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

మాకవరపాలెం, జూలై 11 : మండల కేంద్రమైన మాకవరపాలెం 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో 11 కేవీ శెట్టిపాలెం ఫీడర్ పరిధిలో శుక్రవారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఏఈ రామకృష్ణారావు తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లచ్చన్నపాలెం, కొండలఅగ్రహారం, గంగవరం, సీతన్నఅగ్రహారం, శ్రీరామపురం, చంద్రయ్యపాలెం, కృష్ణాపురం గ్రామాల్లో శుక్రవారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్టు చెప్పారు. విద్యుత్ పనులు మరమ్మత్తులు చేపడుతుండడంతో సరఫరా నిలిపి వేస్తున్నట్టు చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

డిగ్రీ ప్రవేశాలకు రిజిస్ట్రేషన్ గడువు పెంపు

నర్సీపట్నం, జూలై 11 : డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు ప్రభుత్వం రిజిస్ట్రేషన్ గడువును పది రోజులు పొడిగించినట్టు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజు తెలిపారు. తొలుత విడుదల చేసి షెడ్యూల్‌లో రిజిస్ట్రేషన్‌లకు పదో తేదీ ఆఖరి తేదీగా పేర్కొనగా, తాజాగా 20వ తేదీ వరకు గడువు పెంచారని తెలిపారు. ఈ నెల 18 తేదీ నుంచి 20 తేదీ వరకు ధ్రువపత్రాలు పరిశీలన, 23 నుంచి 26 వరకు వెబ్ ఆప్షన్స్ ప్రక్రియ ఉంటుందని తెలిపారు. 27న ఆప్షన్స్ మార్చుకోవడానికి అవకాశం ఉందని, 30న సీట్ల కేటాయింపు ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు.

సీసీ టీవీ ఫుటేజీలు లేక చోరీ కేసు దర్యాప్తునకు ఆటంకం

నర్సీపట్నం, జూలై 11 : శ్రీవేంకటేశ్వరస్వామి గుడిలో చోరీ జరిగిన ఉదంతం దృశ్యాలు సీసీ కెమెరాలలో రికార్డింగ్ కాకపోవడం పోలీసుల విచారణకు ఆటంకంగా మారింది. మంగళవారం మధ్యాహ్నం 1.30 నిమిషాలకు పూజారి, దేవదాయ శాఖ జూనియర్ అసిస్టెంట్ అప్పారావు, పని మనిషి భోజనానికి వెళ్లిన తర్వాత చోరీ జరిగింది. 2022 మే నెలలో కూడా హుండీ తాళం పగలగొట్టి నగదు అపహరించారు. దొంగతనానికి వచ్చిన వ్యక్తి గుడి గోడ దూకి వచ్చి ఉంటాడని, సీసీ కెమెరాలు స్విచ్ ఆఫ్ చేశారని దేవదాయ శాఖ అధికారులు అంటున్నారు.

కాగా, 2022 నుంచి సీసీ కెమెరాలు పని చేయడం లేదు. ఈ విషయాన్ని అధికారులు కూడా ఇన్నాళ్లు పట్టించుకోలేదు. కాగా, ఆలయంలో హుండీ తాళం పగులగొట్టింది ఇంటి దొంగ పనే అయి ఉంటుందని అధికారులు అనుమానిస్తున్నారు.

త్రిపుల్ ఐటీకి పెదబొడ్డేపల్లి విద్యార్థులు ఇద్దరు ఎంపిక


దిలీప్‌కుమార్

నర్సీపట్నం, జూలై 11 : పెదబొడ్డేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు త్రిపుల్ ఐటీ సీట్లు సాధించారు. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో కొరిబిల్లి సాయి దిలీప్‌కుమార్‌కు 570, పిల్లా తేజస్వినికి 571 మార్కులు సాధించారు. తాజాగా శ్రీకాకుళంలోని త్రిపుల్ఐటీ కళాశాలలో వీరిద్దరికీ సీట్లు రావడంతో ఉపాధ్యాయులు అభినందించారు.


తేజస్విని

యువత స్వచ్ఛంద సేవతో అందుబాటులోకి బస్‌షెల్టర్

నర్సీపట్నం, జూలై 11 : బలిఘట్టంలో యువత స్వచ్ఛంద సేవతో బస్సు షెల్టర్ ప్రజలకు అందుబాటులోకి వచ్చింది.గత ఐదేళ్లుగా ఈ బస్సు షెల్టర్ రంగులు వెలిసి పోయి, దుమ్ముధూళితో నిరుపయోగంగా ఉంది. స్థానిక జీవీఆర్ యూత్ సభ్యులు ముందుకు వచ్చి శుభ్రం చేసి, రంగులు వేయించి బస్సు షెల్టర్‌ను అందుబాటులోకి తేవడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


బలిఘట్టం వద్ద సిద్ధమైన బస్‌షెల్టర్

సర్కిల్ పీఎస్ భవనానికి మోక్షం కలిగేనా?

... 5వ పేజీ తరువాయి

మోక్షం లభించలేదు. ఈ కార్యాలయం నుంచి మాడుగుల సర్కిల్ విడిపోవడంతో ప్రస్తుతం ఈ భవనాన్ని రికార్డులు భద్రపరచడానికి మాత్రమే ఉపయోగిస్తున్నారు.

చాలీచాలని గదుల్లో అవస్థలు

ప్రస్తుతం టౌన్ సర్కిల్ భవనంలోనే సీఐ, ఎస్ఐలు, ఇతర సిబ్బంది సర్దుకుని ఉండవలసిన పరిస్థితి నెలకొంది. ఈ చిన్న భవనంలోనే సీసీ కెమెరాల ఫుటేజీ నిక్షిప్తం చేసే గది, ఎస్ఐలు, స్టేషన్ రైటర్ గది, ఖైదీల సెల్, పట్టుబడిన గంజాయి, ఇతర నిషేధ వస్తువులను నిల్వ ఉంచే వరండాలతో స్టేషన్ మరింత ఇరుకుగా మారింది. ఎక్కువ మందిని ఏదైనా కేసులో పోలీస్ స్టేషన్‌కు తీసుకుని వస్తే, వారిని ఎక్కడ ఉంచాలో కూడా తెలియని పరిస్థితి ఉంది. పోలీస్ స్టేషన్ ఆవరణలోనే ఒక పక్క సీజ్ చేసిన వాహనాలు ఉంచడంతో మరింత ఇరుకుగా మారింది. ఇక స్టేషన్ పక్కన ఉన్న ప్రదేశంలో సీజ్ చేసిన ఇసుక కుప్పలు, కేసుల్లో పట్టుబడిన వాహనాలతో పేరుకుపోయింది. పాత సర్కిల్ కార్యాలయం భవనం వెనుకన అంతా తుప్పలు పేరుకుపోయి అధ్వానంగా ఉంది. ఈ పోలీస్ స్టేషన్ భవనాల స్థానంలో పక్కా భవనాలు నిర్మించాలంటూ గతంలో పోలీస్ అధికారులు ఎన్ని ప్రతిపాదనలు పంపించినా, ఇప్పటికీ వాటికి మోక్షం కలగలేదు. ఈ సమస్యను గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అసెంబ్లీలో ప్రస్తావించడం, దానికి అప్పటి హోం మంత్రి సుచరిత స్పందించి సర్కిల్ పోలీస్ స్టేషన్‌కు కొత్త భవనం నిర్మిస్తామని ప్రకటించడంతో కష్టాలు తీరతాయని అంతా భావించారు. అయితే ఇప్పటి వరకు ఎటువంటి పురోగతి లేదు. కూటమి ప్రభుత్వ హయాంలోనైనా ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని పోలీసులు ఆశిస్తున్నారు.

మాడుగుల, చోడవరం మధ్య సెజ్

... 5వ పేజీ తరువాయి

టీజీ భరత్, గుమ్మడి సంధ్యారాణి, ఎంపీలు ఎం.శ్రీభరత్, సీఎం రమేష్, గాజువాక, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, పి.గణబాబు, విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్, హరేంధిర్ ప్రసాద్ వేదికపై ఉన్నారు. ఇంకా ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, వేపాడ చిరంజీవిరావు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, విష్ణుకుమార్‌రాజు, పంచకర్ల రమేష్‌బాబు, బండారు సత్యనారాయణమూర్తి, సుందరపు విజయకుమార్, కేఎస్ఎన్ఎస్ రాజు, సీపీ శంఖబ్రత బాగ్చి, ప్రభుత్వ కార్యదర్శులు సునీత, అహ్మద్‌బాబు, అనకాపల్లి కలెక్టర్ విజయకృష్ణన్, టీడీపీ నేతలు గండి బాబ్జీ, సీతంరాజు సుధాకర్, పీలా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'లులు' ప్రతినిధులతో చర్చిస్తాం

గతంలో తమ ప్రభుత్వ హయాంలో అనుమతులు మంజూరుచేసిన లులు మాల్‌ను ఆర్కే బీచ్‌రోడ్డులో ఏర్పాటుచేసేందుకు ప్రయత్నిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. ఆ సంస్థ ప్రతినిధులతో చర్చిస్తామన్నారు. అదేవిధంగా గాజువాకలో హిందుస్థాన్ జింక్ కర్మాగారం ప్రాంతంలో బిజినెస్ సెంటర్ ఏర్పాటుకు గతంలోనే వేదాంత సంస్థతో ఒప్పందం జరిగిందని, అయితే వైసీపీ ప్రభుత్వం దానిని పూర్తిగా పక్కనపెట్టేసిందన్నారు. దానిని తిరిగి పట్టాలెక్కించేందుకు చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి తెలిపారు.

వీఎంఆర్‌డీఏ రూపొందించిన మాస్టర్ ప్లాన్‌లో వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇష్టానుసారంగా మార్పులు చేశారని సీఎం అన్నారు. అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేలా మాస్టర్‌ప్లాన్‌ను తయారుచేయాలని అధికారులను ఆదేశించారు.

జిల్లాకు బాబు వరాలు

... 5వ పేజీ తరువాయి

పూర్తి చేసి, అనకాపల్లి జిల్లాలో మొత్తం 2 లక్షల 80 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు.

షుగర్ ఫ్యాక్టరీల సమస్యకు శాశ్వత పరిష్కారం

జిల్లాలో వైసీపీ ప్రభుత్వ హయాంలో మూతపడిన మూడు షుగర్ ఫ్యాక్టరీల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ఎన్‌డీఏ ప్రభుత్వం అడుగులు వేస్తోందని చంద్రబాబు తెలిపారు. షుగర్ ఫ్యాక్టరీలను స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేల సహకారంతో ఇథనాల్ ఉత్పత్తి కేంద్రాలుగా మార్చి చెరకు రైతులకు న్యాయం చేయడమే ఎన్‌డీఏ లక్ష్యమన్నారు.

చోడవరం
నియోజకవర్గం

కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు

రావికమతం, జూలై 11 : కౌలు రైతులు గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని తహసీల్దార్ రమణారావు, వ్యవసాయాధికారిణి డి.రూప సూచించారు. ఇక్కడి తహసీల్దార్ కార్యాలయంలో వ్యవసాయ, రెవెన్యూ శాఖల సిబ్బందితో కౌలు రైతుల గుర్తింపు కార్డులపై ఏర్పాటైన శిక్షణ శిబిరంలో మాట్లాడారు. అర్హులైన కౌలు రైతులందరికీ ఈ కార్డులు అందేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో హెచ్‌డీటీ మురళీధరరావు, ఆర్ఐ సతీష్, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

నరసింహావతారంలో జగన్నాథుడు

» చోడవరంలో నేత్రపర్వంగా రథోత్సవాలు

చోడవరం, జూలై 11 : జగన్నాథస్వామి రథోత్సవాల సందర్భంగా గురువారం స్వామివారు నరసింహావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత ప్రధానార్చకులు సుదర్శన సీతారామాచార్యులు ఆధ్వర్యంలో విశేష అలంకరణలు చేపట్టి, ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో విచ్చేసి పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వాణిబాబు, ఉప్పల బాబు, ఉపాధ్యాయుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



'మహిళల సమగ్రాభివృద్ధే మిషన్ శక్తి లక్ష్యం'

బుచ్చెయ్యపేట, జూలై 11 : మహిళల సమగ్రాభివృద్ధే మిషన్ శక్తి పథకం లక్ష్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి అన్నారు. మంగళాపురలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం మిషన్ శక్తి అండర్ డేస్‌పై ఏర్పాటైన అవగాహన సదుస్సులో మాట్లాడారు. మహిళల భద్రత, సాధికారత కోసం ఉద్దేశించిన పథకమే మిషన్ శక్తిగా పేర్కొన్నారు. దివ్యాంగులు, సామాజికంగా ఆర్థికంగా అట్టడుగున ఉన్న వారితో పాటు బలహీనవర్గాల వారి సాధికారత కోసం స్వల్పకాలిక, దీర్ఘకాలిక సేవలను ఇందులో భాగంగా అందిస్తామన్నారు. ఈ సదస్సులో వడ్డాది పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ మౌనిక, ఎంఎస్‌కే మహాలక్ష్మి, సర్పంచ్ పద్మరేఖ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.


మిషన్ శక్తిపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ రాజేశ్వరి

డిగ్రీ కళాశాలలో ప్రపంచ జనాభా దినోత్సవం

చోడవరం, జూలై 11 : ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. తొలుత ప్రిన్సిపాల్ డాక్టర్ రాధాకృష్ణ మాట్లాడుతూ జనాభా పెరుగుదల వల్ల ఎదురయ్యే సవాళ్లను వివరించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, హెచ్‌వోడీ రాధాకృష్ణలతో పాటు అధ్యాపకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. న్నారు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ రాధాకృష్ణ

'గ్రామీణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి'


సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో

కె.కోటపాడు, జూలై 11: సచివాలయ, ఆరోగ్య సిబ్బంది గ్రామీణుల ఆరోగ్య పరిరక్షణకు పెద్దపీట వేయాలని ఎంపీడీవో బీఎస్‌కేఎన్ పట్నాయక్ సూచించారు. దాలివలసలో గ్రామ సచివాలయం, ఆరోగ్య కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలను గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ ప్రతిరోజూ మంచినీటి ట్యాంకులను పరిశీలించి క్లోరినేషన్ చేయాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అంతా అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

15న ఆలయ భూములు కౌలుకు వేలం

చోడవరం, జూలై 11 : మండల కేంద్రం చీడికాడలోని శ్యామలాంబ అమ్మవారి ఆలయ భూములను ఈనెల 15న కౌలుకు వేలం వేయనున్నట్టు స్థానిక దేవదాయ శాఖ ఈవో ఎస్‌వీవీ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. సదరు గ్రామంలోని రామాలయం వద్ద నిర్వహించనున్న ఈ ప్రక్రియలో పాల్గొనదలచినవారు రూ.50 వేల నగదును ధరావత్తుగా చెల్లించాల్సిందిగా ఆయన సూచించారు.

హెల్త్ క్లినిక్‌ను సందర్శించిన టాస్క్‌ఫోర్స్

కె.కోటపాడు, జూలై11 : మండలంలోని ఆర్లి గ్రామంలో విలేజ్ హెల్త్ క్లినిక్‌ను గురువారం జిల్లా ఆరోగ్య శాఖ టాస్క్ ఫోర్స్ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ బృందం అధికారిణి డాక్టర్ లూసీ కార్డిలియా ఆధ్వర్యంలో సిబ్బంది గ్రామంలో పర్యటించి గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు రక్తహీనత పరీక్షలు నిర్వహించారు. సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బృందం సభ్యులు డీపీహెచ్ఎన్‌వో డి.నాగమణి, గణాంకాధికారి, డేటా మేనేజర్లు జనార్థన్, దినేష్, చౌడువాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో ఉపాధి పనులు పరిశీలన

రావికమతం, జూలై 11 : మండలంలోని చినపాచిల, మత్స్యపురం గ్రామాల పరిధిలో ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపడుతున్న పూడికతీత పనులను ఏపీవో కాశి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలు తమకు నిర్దేశించిన కొలతలలో పనులు చేసి రోజుకు రూ.మూడు వందల రూపాయల వేతనం పొందాలన్నారు. ఈసీ కామేష్,టీఏ రమణ పాల్గొన్నారు.

తుడుము వీధిలో పారిశుధ్య సమస్య పరిష్కారం

మాడుగుల రూరల్, జూలై 11 : మండల కేంద్రం మాడుగుల తుడుము వీధిలో పారిశుధ్య సమస్య ఎట్టకేలకు పరిష్కారమైంది. జల్ జీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటి కుళాయిల ఏర్పాటు నిమిత్తం సీసీ రోడ్లను తవ్వి పైప్‌లైన్ వేసి, కుళాయిలు వేశారు. గతంలో వేసిన పాత పైప్‌లైన్ ద్వారా ప్రస్తుతం పంచాయతీ కుళాయిలకు నీరు సరఫరా చేస్తుంది. దీంతో లీకేజీలు ఏర్పడి నీరు వృథాగా పోతోంది. ఆ నీరు రోడ్డుపైకి చేరుతుండడంతో జల్‌జీవన్ పనుల్లో భాగంగా తవ్విన ప్రదేశం బురదమయంగా మారుతోంది. ఈ కారణంగా స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను 'తుడుము వీధిలో అధ్వానంగా పారిశుధ్యం' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం కథనం ప్రచురితమైంది. దీనిపై వెంటనే ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు స్పందించారు. గురువారం ఆ వీధుల్లో రోడ్డుపై ఏర్పడిన గుంతలను సిబ్బంది ద్వారా పూడ్చివేశారు. ఎత్తు పల్లాలు లేకుండా ఎక్స్‌కవేటర్‌తో చదును చేశారు. పైప్‌లైన్ నిమిత్తం తవ్వినచోట సీసీ లైనింగ్ వేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నరసింహమూర్తి, పారిశుధ్య సమస్య లేకుండా చూస్తామని పంచాయతీ ఈవో నాయుడు తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


చదును చేసి వీధి రోడ్డు


మాడుగుల
నియోజకవర్గం

పల్లెల్లో సమస్యల పరిష్కారమే ధ్యేయం కావాలి


ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న జనసైనికులు

మాడుగుల, జూలై 11 : గ్రామాల్లో సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ దృష్టికి తీసుకు వెళ్లాలని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు గ్రబేటి శివాజీ అన్నారు. గురువారం ఇక్కడ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఇళ్లపు రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటైన పార్టీ శ్రేణుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు. మారుమూల గ్రామాల్లో సమస్యలు అధికంగా ఉన్నాయని, వాటి పరిష్కారమే ధ్యేయంగా టీడీపీ, బీజేపీ నాయకులతో కలిసి జనసైనికులు పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గండెం రాంబాబు, రౌతు ప్రసాద్, మహేష్, రమణారెడ్డి, నగేష్, వీర మహిళలు పాల్గొన్నారు.

ఎట్టకేలకు వాకపల్లికి బస్సు సౌకర్యం


ఆర్టీసీ బస్సును ప్రారంభిస్తున్న కూటమి నాయకులు

దేవరాపల్లి, జూలై 11 : మండలంలోని వాకపల్లికి ఎట్టకేలకు బస్సు సౌకర్యం కలిగింది. ఇక్కడి గ్రామస్థులు రవాణా పరంగా ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి దృష్టికి టీడీపీ మండల అధ్యక్షుడు సూర్యనారాయణతో పాటు పలువురు గ్రామస్థులు ఇటీవల తీసుకు వెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన ఆర్టీసీ ఉన్నతాధికారులతో మాట్లాడి వాకపల్లికి బస్సు సౌకర్యం కల్పించేలా ఏర్పాట్లు చేశారు. దీంతో గురువారం నుంచి బస్సు సౌకర్యం అందుబాటులోకి రావడంతో అంతా ఆనందం వ్యక్తం చేశారు. కూటమి నాయకులు దొగ్గ రమేష్, జి.భాస్కరరావు, గుమ్మడి శ్రీరాం తదితరులు ఈ సర్వీసును ప్రారంభించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దేవరాపల్లి/చీడికాడ, జూలై 11 : బి.కింతాడ సబ్ స్టేషన్ పరిధి ఎం.అలమండ ఫీడర్‌లోని పలు గ్రామాలకు శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ నర్సీపట్నం ఈఈ రామకృష్ణ, ఏఈఈ శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్‌లలో నెలకొన్న లోపాలను సరిచేసే చర్యలలో భాగంగా చేపట్టే పనుల కారణంగా ఎం.అల మండ, ములకలాపల్లి, కొత్తపెంట, ఎన్.గజపతినగరం, ఎ.కొత్తపల్లి, ముషిడిపల్లి, యండపల్లిపాలెం, కె.ఎం.పాలెం, పందూరుపాలెం తదితర గ్రామాలకు సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని వివరించారు.

అలాగే, చీడికాడ మండలంలోని విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా కోనాం, మంచాల, శిరిజాం పంచాయతీల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఆశాఖ ఏఈ నమ్మి వెంకటరావు, తెలిపారు.